


చిమ్మ చీకటి —కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి — ఆ చీకట్లో ట్యాంక్‌బండ్ వెంటే స్థిర చిత్తంతో నడుస్తున్నాడతను. బయట కన్నా భయంకరమైన చీకటి అతడి మనసును కప్పేసి ఉంది... ట్యాంక్‌బండ్ మీద నిలుచుని క్రింద నిశ్చలంగా ఉన్న నీటిలోకి అంతకన్నా నిశ్చలంగా చూస్తున్నాడు —

గట్టిగా ఏడ్వాలనిపిస్తోందతనికి. కానీ ఏడ్వడానికి మనసు అంగీకరించడంలేదు. రక రకాల ఆలోచనల్తో గింజుకుంటోంది.

ఇంతకాలం తన స్వంతమనుకున్న రాణి మరొకరి సొత్తుకాబోతోంది.

ఈ ఆలోచనే అతడి మనసుని మెలిపెట్టేస్తోంది. ఇంక రాణి మరొకరి భార్యగా కనిపిస్తే తను తట్టుకోగలడా ? గుండె పగిలి చావడూ ?

ఒకళ్ళు లేకుండా మరొకళ్ళ జీవితంలేదని ఇద్దరూ ఎన్ని కలలు కన్నారు ! అన్నీ కల్లలే అవుతున్నాయా ?

తనతో గడిపిన క్షణాల్ని రాణి అంత తేలిగ్గా మరిచిపోగలదా ? నో... ఆమె మరిచిపోయినా తను మరిచిపోలేడు... రాణి జీవితం మరొకరితో పంచుకోవడం ఎంతగా భరించలేడో తను మరొకరితో జీవితాన్ని పంచుకోవడం అంతగా భరించలేడు ! అందుకే ఈ వ్యథ.

ఎంత పెద్దల మాటలకి తల వంచితే మాత్రం ప్రేమించిన వ్యక్తిని ఇంతగా వంచిస్తుందా ? వాళ్ళకి కులం అడ్డుగోడ కావచ్చు. తనకి కూడానా ? మరి ప్రేమించేటప్పుడు కులం గుర్తుకు రాలేదా ?

హఠాత్తుగా అతడి కోపమంతా ఆమె మీదకి మళ్ళింది.

ఇద్దరిమధ్యా బంధం అంత పలచబడింది. దీన్ని అంత తేలిగ్గా తెంపేయగలదా ఆ స్త్రీ !

"నన్నన్యాయం చెయ్యకని ఆమె వెంటపడాల్సిందిపోయి నన్నాన్యాయం చెయ్యకు" అంటూ తన వెంటపడడమేమిటి నాన్సెన్స్.

అయినా ఇలాంటి స్త్రీ కోసం తను బాధపడడమేమిటి ? మనసు నుంచి ఆ వంచకి రూపాన్ని తుడిచివేయాలి... తనూ మరో యువతిని పెళ్ళాడి బంగారం లాంటి జీవితాన్ని గడపాలి.

పొరబాటున వాళ్ళెప్పుడైనా కనిపించినా తెలీనట్లు పట్టించుకోకూడదు.

"నో... ఆ పని ఆమె చెయ్యగలదుగానీ తను చెయ్యలేడు. అలాగని గుండెలు పగులుతుంటే తట్టుకోలేడు. అందుకే హుస్సేన్‌సాగర్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే మార్గంగా కనిపించింది.

ఎదురుగా ఉన్న సిమెంటు బల్లకి కాళ్ళు తగిలి ట్యాంక్‌బండ్ వెంట నడుస్తున్న వాడల్లా ఠక్కున ఆగిపోయాడు రాజారావు.

ఇంతకు ముందు తామెన్నిసార్లు చీకటిపడుతున్న వేళల్లో ఇక్కడికి వచ్చి ఈ బెంచీ మీద కూర్చోలేదూ ! తను మాట్లాడుతుంటే ఆమె తన్మయంగా వింటుండేది.

ఆమె మాట్లాడుతుంటే తనంతకన్నా తన్మయంగా వినేవాడు.

ఇప్పుడేమైంది ఆ తన్మయత్త్వం ?

మరొకడితో పంచుకోవడానికి సిద్ధమైందా ? ఎంత నాటకం ?

ఈ నాటకాలు తనాడలేడు.

అందుకే ఈ జీవితం నుంచే తప్పించుకోవాలనుకుంటున్నాడు.

హుస్సేన్‌సాగర్ దగ్గర షికార్లు కొట్టడానికి రాలేదు తనిప్పుడు. అందులో దూకి చావడానికి వచ్చాడు.

చావాలనుకున్న వాడికి ఈ లౌకిక ఆలోచనలెందుకు ? గుండె నిబ్బరం చేసుకోవాలి. అలా చేసుకోలేకే కదా ఈ బాధ...

ఇంతలో కొద్దిగా దూరంలో ఏదో అలికిడి అవడంతో అటు చూశాడు. ఎవరో ఇటే వస్తున్నారు.

.తను ఆత్మహత్య చేసుకోవడానికి ఇటు వచ్చాడని అతను పసిగడితే కష్టం...

చటుక్కున అక్కడున్న బల్ల మీద కూలబడిపోయాడు.

తన ఆలోచనలతో తను సతమతమైపోతున్న సూర్యారావ్, రాజారావ్‌ని తత్తరబాటుని గమనించను కూడా గమనించలేడు. కాళ్ళు తనకి తెలియకుండా ముందుకు కదులుతున్నాయోగాని కళ్ళు చూసే వాటిని వేటినీ మనసు రికార్డు చేసుకోవడంలేదు....

తండ్రి మీద కోపంతో అతని మనసు కుతకుతలాడిపోతోంది.

తనని కన్నవాడే కావచ్చు, తనకి చదువు చెప్పించి ఇంతటి వాణ్ణి చేసిన వాడే కావచ్చు.... అయితే మాత్రం తను మాటిచ్చాడని... తను ఎన్నిక చేసిన అమ్మాయినే ఇష్టంలేకపోయినా కష్టమేననుకోవాలా ? సంసారం చేసేది ఎవరు ? వాళ్ళ ఇష్టాయిష్టాలతో పని లేదా ? అయినా ఉద్యోగం కూడా లేని వాడికి తనకి పెళ్ళేమిటి ? వాళ్ళనీ నకరం పెట్టడానికా ?

తండ్రి మీద కోపం కాబోయే భార్య రాణి మీదకి మళ్ళింది.

రాణిట రాణి !

వ్యక్తిత్వం లేని మనిషి !

ఆడది అబల కాదని, సబలని నిరూపిస్తున్న ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఆడ పిల్లలు ఇంకా ఉన్నారా ? పెళ్ళి కావడమే వాళ్ళకి పరమావధా ?

ఉద్యోగం, సద్యోగంలేని వాణ్ణి కూడా తండ్రి కుదిరిస్తే చేసేసుకుంటారా ? రేపతను తనని పోషించగలడా ? లేడా ? అనే విషయం కూడా ఆలోచించరా ?

తనకి ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఏ కోశానాలేదు. కానీ త్వరలోనే ఈ గుదిబండ మెడకి పడుతుందని తెలుసు.

ఇప్పుడింతగా వత్తిడి చేస్తున్నా నాన్నని రేపు పెళ్ళయిన తర్వాత నాన్నా నా అప్లికేషన్లకే కాక నా పెళ్ళాం పువ్వులకీ డబ్బులివ్వమని తను అడగగలడా ? అడిగినా ఆయనిస్తాడా ? ముఖాన ఉమ్మేయడూ —చాతకాని వెధవా అంటూ పెళ్ళామూ చీదరించుకోదు ... తర్వాత తర్వాత ఆ పని ఆమె ముందే ఎందుకు చేయదు ? రేపటి గురించి ఆలోచించలేదా ?

ఎవ్వరూ తన గురించి ఆలోచించరు. అందుకే తన గురించి తనే ఆలోచించుకున్నాడు. ఆత్మహత్య తప్ప మరో గత్యంతరం లేదని ఇటు వచ్చాడు...

ఎవరిదో దగ్గు వినిపించడంతో ఆలోచనల్లోంచి బయటపడ్డాడు సూర్యారావు.

ఎదురుగా బల్ల మీద ఏదో మానవాకారం !

ఇంత అర్ధరాత్రివేళ ఇక్కడ కూర్చున్న దెవరు ? తనలాంటి వాడేనేమో ?

అతనెవరైతే తనకెందుకు కాసేపట్లో ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోతున్నాడతను. అంతవరకూ తనెవరూ గమనించకుండా జాగ్రత్తపడాలి. అంతే !

రాజారావు కూర్చున్న బల్లమీదే మరో చివర్న కూర్చున్నాడు సూర్యారావు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ఇద్దరి ఆలోచనలూ ఒకరి చుట్టూనే అల్లుకున్నాయన్న విషయం ఆ ఇద్దరికీ తెలియదు. తామిద్దరూ కూడా ఆత్మహత్య చేసుకోవాలనే ఒకే పని మీద వచ్చారని వాళ్ళకి తెలియదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

సెకండ్లు నిమిషాలుగా మారుతున్నాయి.

వాళ్ళిద్దరి ఆలోచనల్లోనూ క్రమంగా మార్పు రాసాగింది.

ఆమె శుభ్రంగా మరొకర్ని పెళ్ళి చేసుకుని సంసారం చెయ్యబోతుంటే తనెందుకు ఆత్మహత్య చేసుకోవాలి ? చేసుకోకూడదు... ఓ స్థిర నిర్ణయానికి వచ్చి లేచినించున్నాడు రాజారావ్.

"నాకు ఉద్యోగం లేదు పెళ్ళి తర్వాత చేసుకుంటానని మొత్తుకుంటున్నా చెల్లి పెళ్ళికి కట్నం వెదుక్కోకుండా ఉండడానికి నాన్న ఈ పెళ్ళి చేస్తున్నాడు. అటువంటప్పుడు నా భారమే కాదు ఆమె భారమూ ఆయనే చూసుకుంటాడు. నేనెందుకు చావాలి... సూర్యారావు లేచి నించున్నాడు.

ఇద్దరూ రెండు వైపులా బయల్దేరారు. వాళ్ళ సమస్యే కాదు దారులూ వేరే.

ఎవరో దబ్బున నీళ్ళల్లోకి దూకిన చప్పుడు కావడంతో ఇద్దరూ ఒక్కసారిగా హుస్సేన్‌సాగర్‌లో అటువైపు చూశారు.

బుడగలు వస్తున్నాయి.

"అరె ! ఎవరో ఆత్మహత్య చేసుకోవడానికి హుస్సేన్‌సాగర్‌లో దూకినట్లున్నారు... "రాజారావు అంత వరకూ తన ప్రక్కన కూర్చున్నా మాట్లాడడానికి కూడా ప్రయత్నించిన వ్యక్తితో అన్నాడు.

"అవున్నిజమే... నేనూ దూకిన శబ్దాన్ని విన్నాను..." సూర్యారావు అన్నాడు.

ఇద్దరి గుండెలు గుబగుబలాడుతున్నాయి.

ఎవరో ఆత్మహత్య చేసుకున్నారు.

ఇక తమక్కడ ఉండడం మంచిది కాదు...

ఇద్దరూ ఒకేసారి రెండుప్రక్కలకీ బయల్దేరారు.

ఇప్పుడు వాళ్ళ మనస్సుల్లో ప్రేమ, పెళ్ళికి సంబంధించిన ఆలోచనలేవీ లేవు. వాళ్ళకున్నది ఒక్కటే ఒక్క ఆలోచన —తానిప్పుడు అర్జెంటుగా ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి... ఎక్కడికి అన్నది తర్వాత...

ఇద్దరూ గబగబా నడుస్తున్నారు. కానీ ఇద్దరిలో ఇద్దరికీ ఆ హుస్సేన్‌సాగర్‌లో దూకిన వ్యక్తి తన లాగానే ఈ సమస్యతోనే ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన రాణి అయి ఉంటుందనే ఆలోచన కూడా రాలేదు.

ఎంతసేపటికీ ఆలోచనలు తమ గురించే తప్ప ఎదుటి వ్యక్తి గురించిలేనేలేవు. రానేరావు ! ఇదీ మనిషి విశాల భావం.

అందుకే తమకన్నా మిన్నగా తల్లడిల్లిపోతున్న రాణి ఏ ఆలోచనకి తావీయకుండా ఆత్మహత్య ఒక్కటే తనకి శరణ్యమని దూకేసి ఉంటుందని ఊహించను కూడా వూహించలేరు. వాళ్ళ ఆలోచనలు వాళ్ళ చుట్టూనే ! కానీ ఆమె ఆలోచనలు అన్ని ప్రక్కలకీ ప్రసరించాయి. అందుకె! ఆత్మహత్యే శరణ్యం అనుకుంది. అనుకున్నంత పనీ చేసింది. ●



ఒక షాపులో గడియారం దొంగతనం చేస్తూ ఓ కుర్రాడు పట్టుబడ్డాడు. పోలీసులు అతడ్ని లాకప్‌లో పెట్టారు. అక్కడే ఉన్న ఓ పెద్ద దొంగ ఆ కుర్రాడిపై సానుభూతి చూశాడు.

ఎందుకు బాబూ ఇలా చిన్న చిన్న వాటి గురించి టైంవేస్ట్ చేస్తావు. ఏదైన బ్యాంక్‌లో డబ్బు కొట్టేయ్యకూడదు. అన్నాడు.

ఎం చెయ్యమంటారండీ మా స్కూలు వదిలిపెట్టే సరికి బ్యాంకులన్నీ మూసేస్తున్నారు.

అభినయ

డైరెక్టర్: ఈ సీన్‌లో రాక్షసిపాత్ర వేయడానికి భయంకరంగా కనిపించే ఓ అమ్మాయి కావాలి. అర్జెంట్‌గా పిలిపించ గలరా?

ప్రొడ్యూసర్: దానికి అంతగా ఆలోచించవలసిన అవసరం లేదు. మన హీరోయిన్‌కి మేకప్ తీసేస్తే సరి.

ఎస్. శివానంద్
హైదరాబాద్

